కేంద్ర బొగ్గుగనుల సంప్రదింపుల సంఘం సభ్యుడిగా వద్దిరాజు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): కేంద్రబొగ్గు గనుల శాఖ సంప్రదింపుల సంఘం సభ్యుడిగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నియమితులయ్యారు. ఈ సంఘానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా, ఎంపీ రవిచంద్ర పెట్రోలియం సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఏసీబీకి చిక్కిన ఘట్‌కేసర్ ఇన్‌చార్జి ఏఈ

ఘట్‌కేసర్, అక్టోబర్25: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి ఏఈ రాజశేఖర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇటీవల జరిగిన గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇందుకు కోసం క్రేన్లను ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ బిల్లు పాస్ చేయాలని కోరగా రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్ని రూ.1.50 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో సదురు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం రాజశేఖర్‌కు రూ.50వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సన్నికి ఫోన్ పేలో రూ.30వేలు చెల్లించినట్టు కాంట్రాక్టరు చెప్పడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

డీఏపై సీఎం హామీ ఉత్తముచ్చటే

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నిరాశ

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం నుంచి డీఏ చెల్లింపు ప్రకటన వస్తుందని ఆశగా ఎదురుచూసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నిరాశే మిగిలింది. శుక్రవారం సాయంత్రంలోగా శుభవార్త చెబుతామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మిన వాళ్లు హామీ ఉత్తదే కావడంతో నిట్టూర్చారు. గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నేతలతో రేవంత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ డీఏలను విడుదల చేయాలని జేఏసీ నేతలు కోరారు. శుక్రవారం సాయంత్రంలోగా డీఏలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన చేస్తారని రేవంత్ తెలిపారు. దీంతో కనీసం రెండు డీఏలైనా విడుదల చేస్తారని అంతా భావించారు. ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన వస్తుందన్న ఆశల్లో సంఘాల నేతలు తేలియాడారు. కానీ భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. డీఏలపై ప్రకటన వెలువడకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆశలు ఆవిరయ్యాయి. డిప్యూటీ సీఎం అందుబాటులో లేకపోవడం, శుభవార్త రాకపోవడంతో ఉద్యోగ సంఘాల నేతల్లో అసంతృప్తి నెలకొంది. సీఎం మాట కూడా ఉత్తముచ్చటే అయింది కదా అని అసంతృప్తి చెందుతున్నారు.

కొండా వ్యాఖ్యలు జుగుప్సాకరం

- ఇకపై కేటీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు
- మీడియా ఆ వ్యాఖ్యలను తక్షణమే తొలగించాలి
- పరువు నష్టం కేసులో సిటీ సివిల్ కోర్టు ఆదేశం

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీఆర్‌కు వ్యతిరేకంగా మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు తీ వ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇకపై కొండా సు రేఖ నోటికి వచ్చినట్టు మాట్లాడ రాదని, ఎలాం టి అనుచిత వ్యాఖ్య లు చేయరాదని నాంపల్లిలోని సిటీ సివిల్ కోర్టు మంత్రి కొండాసురేఖ ను ఆదేశించింది. పరువు, ప్రతిష్ఠలు కలిగిన కే టీఆర్‌పై మరొక సారి నిందారోపణలు చేయ డం మంచిది కాదని పేర్కొంది. మంత్రి కొం డా సురేఖకు వ్యతిరేకంగా కేటీఆర్ దాఖలు చే సిన రూ.100 కోట్ల పరువు నష్టం దావాలో 25వ అదనపు చీఫ్ జడ్జి శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 2న మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడిన మాటలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని, ఆ ప్రసంగాన్ని ప్రసారం చేసిన టీవీ చానళ్లు, యూట్యూబ్ చానళ్లు, ఫేస్‌బుక్, గూగుల్, పత్రికల్లో ప్రచురితమైన కథనాలను, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తల్ని తిరిగి ప్రసారం చేయరాదని, ప్రచురించకూడదని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఓ మహిళా మం త్రి వ్యాఖ్యలను కోర్టు తీవ్రంగా పరిగణించి తీవ్ర హెచ్చరికలతో ఉత్తర్వులు జారీచేయడం గమనార్హం. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సా మాజిక మాధ్యమాలకు వేర్వేరుగా ఆరు ఉత్తర్వుల ప్రతులను కోర్టు జారీ చేసింది. ఇలాంటి అనుచిత వార్తల వల్ల సమాజంలో చెడు ప్రభావం కలిగే ప్రమాదముందని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. కేటీఆర్ దాఖలు చేసిన 100 కోట్ల పరువు నష్టం దావాకు కోర్టు ఫీజుగా కోటి రూపాయలను (రూ.1,00, 02,426) బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతానుంచి కోర్టుకు ఆన్‌లైన ద్వారా కేటీఆర్ చెల్లించారు. కొండా సురేఖతోపాటు పత్రికా సంస్థలు, ప్రముఖ టీవీ చానళ్ల యాజమాన్యాలను కలిపి మొత్తం 15 మందిపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. కేటీఆర్‌కు కోర్టు అండగా నిలవడం న్యాయానికి నిదర్శనంగా నిపుణులు భావిస్తున్నారు. గతంలోనూ ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం సైతం ఘాటుగా స్పందించినప్పటికీ ఆమెలో మార్పురాకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధి లలితారెడ్డి తదితరులు

మంత్రి సురేఖకు కోర్టు మొట్టికాయలు

కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల సిటీ సివిల్ కోర్టు ఆమెకు మొట్టికాయలు వేసిందని బీఆర్ఎస్ లీగల్‌సెల్ ప్రతినిధి లలితారెడ్డి చెప్పారు. కోర్టు ఆదేశాలను మంత్రితోపాటు ఆయా సంస్థలు పాటించాల్సి ఉంటుందని, ఒకవేళ ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణ నేరం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ ఈ నెల 2న మంత్రిస్థాయిలో ఉండి వేరే మహిళలపై చెడు వ్యాఖ్యలు చేశారని, వాటిని కేటీఆర్‌కు ఆపాదించారని తెలిపారు. దాంతో కేటీఆర్ ఆమెపై క్రిమినల్ డిఫమేషన్, రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేశారని తెలిపారు. పిటిషన్‌పై విచారణ జరిపిన సిటీ సివిల్ కోర్టు శుక్రవారం ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, ఇందులో కొండా సురేఖతోపాటు 15 మీడియా సంస్థలను భాగస్వాములను చేసిందని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులు వేణుగోపాల్‌రావు, జక్కుల లక్ష్మణ్, అక్కి భాస్కర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, కావ్యశ్రీ, కార్తీక్ పాల్గొన్నారు.

గ్రూప్-1లో కాపీయింగ్

- ఇబ్రహీంపట్నం సీవీఆర్ కాలేజీలో ఘటన
- చేతిపై ఆన్సర్లతో వచ్చిన మహిళా అభ్యర్థి డీబార్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో కాపీయింగ్ ఘటన చోటుచేసుకున్నది. కాపీయింగ్‌కు పాల్పడ్డ అభ్యర్థిని సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని డీబార్ చేశారు. అధికారులు తెలిపిన వివరాలు.. శుక్రవారం జరిగిన 'ఎకనామీ అండ్ డెవలప్‌మెంట్' పేపర్ పరీక్షకు ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ కాలేజీలో మహబూబ్‌నగర్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళా అభ్యర్థి పరీక్షకు హాజరైంది. ఆమె కొన్ని గణాంకాలను తన చేతిపై రాసుకొని వచ్చినప్పటికీ తనిఖీ సమయంలో సిబ్బంది గుర్తించలేదు. హాల్లోకి వెళ్లాక అభ్యర్థులకు ఆన్సర్లు షీట్లు అందజేయగానే లక్ష్మి ఆన్సర్‌షీట్ వెనుక రఫ్‌షీట్‌లో రాయడం ప్రారంభించింది. ప్రశ్నపత్రం ఇవ్వకముందే ఆమె ఆన్సర్లు రాయడాన్ని గమనించిన ఇన్విజిలెటర్లు తనిఖీ చేయగా.. చేతిపై ఆన్సర్లు రాసుకొచ్చినట్లు గుర్తించి డీబార్ చేయించారు. అయితే ఈ ఘటనలో మరో వాదన వినిపిస్తున్నది. సదరు మహిళా అభ్యర్థి చీరకొంగులో చీటీ పెట్టుకొచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నది. కాగా, గ్రూప్-1 మెయిన్స్ పేపర్-4 పరీక్షకు 67.4 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. 31,383 మందికి 21,195 మంది రాసినట్టు టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ వెల్లడించారు.

సీల్ లేకపోవడంపై అనుమానాలు : సతీశ్‌రెడ్డి

గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్‌పై అనుమానాలు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ నేత వై సతీశ్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. ఈ మేరకు సీల్ ఉన్న, సీల్ లేని ప్రశ్నపత్రాలను పోస్టుచేశారు. సైనిక్‌పురి డిఫెన్స్‌కాలనీ భవన్స్ శ్రీరామకృష్ణ విద్యాలయం పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు ఇచ్చిన ప్రశ్నపత్రంపై సీల్ లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మెతుకు ఆనంద్ తదితరులు

గ్రూప్-4 అభ్యర్థులకు 'రీలింక్విష్‌మెంట్' పెట్టాలి

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-4 అభ్యర్థులకు రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ పెట్టాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉన్న తోడ్పోగాలను తొలుత భర్తీ చేయాలని, లేనిపక్షంలో 4 వేల మంది అభ్యర్థులు రోడ్డున పడే ప్రమాదం ఉందని తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టులు ఉండవని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, రంగినేని అభిలాశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రూల్-6లో చట్టసవరణ చేస్తే అభ్యర్థులు అన్‌విల్లింగ్ ఆప్షన్ పెట్టుకోవచ్చని చెప్పారు. గ్రూప్-4 పోస్టుల భర్తీలో కూడా అన్‌విల్లింగ్ ఆప్షన్ పెట్టుకుంటే 3 నుంచి 4 వేల మందికి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. జీవో 29కి వ్యతిరేకంగా గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళనలు చేపట్టారని, వారికి మద్దతుగా బీఆర్ఎస్ సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని తెలిపారు. గ్రూప్-4లో 8 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తుచేశారు. హోంశాఖను తన వద్దే పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి పోలీస్ శాఖపై శ్రద్ధచూపడం లేదని మండిపడ్డారు.

పద్మశ్రీ కనకరాజు ఇక లేరు

- అనారోగ్యంతో నృత్య గురువు కన్నుమూత
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీఎం రేవంత్ సంతాపం
- ఆదివాసీ సంస్కృతి సేవలకు 2021లో పద్మశ్రీ
- నేడు స్వగ్రామం మార్లవాయిలో అంత్యక్రియలు

రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అందుకుంటున్న కనకరాజు (ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్/హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గుస్సాడీ నృత్య ప్రదర్శనలు ఇచ్చి తమ జాతికే వన్నె తెచ్చిన పద్మశ్రీ కనకరాజు శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయికి చెందిన కనకరాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు వివిధ దవాఖానల్లో చికిత్స చేయించారు. శుక్రవారం సాయంత్రం ఆరోగ్యం క్షీణించి తుదిశ్వాస విడిచారు. గుస్సాడీ నృత్య గురువుగా పేరుగాంచిన కనకరాజు వందలాది మంది యువకులకు తన కళను నేర్పించారు. దేశవ్యాప్తంగా గుస్సాడీ నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2021 నవంబర్ 9న ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది. ఆదివాసీ గోండుల గుస్సాడి నృత్యానికి వన్నెతెచ్చిన గుస్సాడి కనకరాజు మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కనకరాజు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన కృషిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తగురీతిలో ప్రోత్సహించి సత్కరించిందని వారు గుర్తుచేసుకున్నారు. ఆదివాసీల గుస్సాడీ నృత్యానికి దేశవ్యాప్త ఖ్యాతిని తెచ్చారని కీర్తించారు. ఎర్రకోటపై తన నృత్యాన్ని ప్రదర్శించి తెలంగాణ ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించారని కేటీఆర్ గుర్తుచేశారు. గుస్సాడి నృత్యానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప కళాకారుడు కనకరాజు మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన మరణం పట్ల సీఎం తీవ్రం సంతాపం ప్రకటిస్తూ.. వారి కు టుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కనకరాజు అంత్యక్రియలు స్వగామమైన మార్లవాయిలో ఆదివాసీల సంప్రదాయం ప్రకారం శనివారం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

రేవంత్, సంజయ్.. ఆర్ఎస్ బ్రదర్స్

- మూసీపై పాలిటికల్ డ్రామా ఆపండి
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ఆ ఇద్దరు రేవంత్, సంజయ్-ఆర్ఎస్ బ్రదర్స్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. మూసీ ప్రాజెక్టుపై ఆర్ఎస్ బ్రదర్స్ పొలిటికల్ డ్రామాను ఆపాలని హితవు పలికారు. ఇద్దరు లీడర్లు పబ్లిసిటీ కోసం ధర్నాల పేరిట స్టంట్లు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌కి చిత్తశుద్ధి ఉంటే మూసీ ప్రాజెక్టుకు అనుమతులివ్వకుండా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి, మూసీ ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు రుణం రాకుండా చూడాలని అన్నారు. కానీ వీటిని పక్కనబెట్టి రాష్ట్రంలో కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ అంతర్గతంగా అవగాహనతో వ్యవహరిస్తూ ప్రజల ముందు మాత్రం ప్రత్యర్థుల్లా ఫోజులు కొడుతున్నాయని వై సతీశ్ రెడ్డి నిప్పులు చెరిగారు. మూసీ నీళ్లతోనే రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, సంజయ్‌కి ప్రజలు అభిషేకం చేస్తారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హాయాంలో పదేపదే జోక్యం చేసుకున్న గవర్నర్, ఇప్పుడు లక్ష కుటుంబాలు రోడ్డున పడుతున్నా మౌనంగా ఉండడం ఎంతవరకు సమంజసమన్నారు.

కొత్త టీచర్లకు జీతాలెప్పుడో..!

- ప్రభుత్వ నిర్ణయంతో సంబిగ్ధత
- డిసెంబర్‌లోనే అంటున్న సంఘాలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొత్తగా ఉద్యోగంలో చేరిన డీఎస్సీ -24 టీచర్లకు వేతనాల చెల్లింపు డోలాయమానంలో పడింది. డీఎస్సీ -2024లో భాగంగా 10వేలకు పైగా టీచర్లను నియమించింది. కొత్త టీచర్లకు ఈ నెల 10 నుంచి వేతనాలిస్తామని విద్యాశాఖ వర్గాలు ప్రకటించాయి. ఈ మేరకు కొత్త టీచర్లందరికి అక్టోబర్ 10వ తేదీతోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. కానీ ఆర్డర్లు ఇచ్చిన వారం తర్వాత జిల్లాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇచ్చారు. కొంత మంది టీచర్లు ఈ నెల 15, మరికొందరు ఈ నెల 17న పాఠశాలల్లో చేరారు. విద్యాశాఖ మాత్రం ఈ నెల 10 నుంచే వేతనాలిస్తామన్నది. పనిచేయని కాలానికి వేతనాలు ఎలా ఇవ్వడమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. జూన్‌లో చేపట్టిన బదిలీల్లో కొంత మంది టీచర్లు బదిలీ అయ్యారు. కొన్ని పాఠశాలల్లో సింగిల్ టీచర్ ఉన్న కారణంగా టీచర్లను రిలీవ్ చేయలేదు. కొత్త టీచర్లు చేరిన తర్వాత రిలీవ్ చేశారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్న కాలానికి జాయినింగ్ రిపోర్టు ఇచ్చే నాటికి వారం రోజుల వ్యవధి ఏర్పడింది. ఈ వ్యవధిలో కొత్త టీచర్లకు వేతనాలు ఇస్తే ఈ నెల 10వ తేదీ నుంచి రిలీవ్ అయ్యే మధ్యకాలానికి ఒకే పోస్టుకు ఇద్దరు టీచర్లకు వేతనాలు డ్రాచేయాల్సి ఉంటుంది. ఇక కొత్త టీచర్లకు ఈ నెల జీతాలు రావడం కష్టంగానే కనిపిస్తోంది. రెండు నెలల వేతనం డిసెంబర్ 1న అందే అవకాశాలున్నాయని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని టీఎస్ యూ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య కోరారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించండి : ఎస్జీటీయూ

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఓటుహక్కు కల్పించాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్(ఎస్జీటీయూ) కోరింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, ఏ వెంకటేశం, పెన్షనర్స్ సంఘం నేత పులి సరోత్తంరెడ్డి శుక్రవారం ఢిల్లీలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, కేంద్ర ఎన్నికల సంఘం సహాయ అధికారి హిర్దిశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర. చిత్రంలో నేతలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్

ప్రజలు బరాబర్ ప్రశ్నిస్తరు

- 420 హామీలు ఇవ్వలేదా?
- అమలుచేయకపోవడం నిజం కాదా?
- పాలన ఇలాగే ఉంటే నేతలు గ్రామాల్లో తిరుగలేరు
- బీఆర్ఎస్ నేత గండ్రహెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తరు.. బరాబర్ ప్రశ్నిస్తరు.. ప్రశ్నిస్తే తప్పేంటి?' అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిలదీశారు. 'ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీలు ఇచ్చింది నిజం కాదా? అమలుచేయకపోవడం వాస్తవం కాదా?' అని ప్రశ్నించారు. రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఎప్పటిలోగా ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నేతలు వాసుదేవరెడ్డి, వై సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు తెలంగాణతో పాటు దేశ,విదేశాల్లో అభిమానులు ఉన్నారని, వారు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. తక్కువ సమయంలో ప్రభుత్వంపై ఇంత ప్రజావ్యతిరేకత ఎన్నడూ చూడలేదని, పాలన ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ నాయకులను ప్రజలు గ్రామాల్లో తిరుగనివ్వరని చెప్పారు. రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఆశ కల్పించారని, ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పత్తికి మద్దతు ధర అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీసీఐ కేంద్రాలతో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి తమ్ముడి అక్రమ అరెస్ట్

- మహబూబ్‌నగర్ రూరల్ పోలీసుల అత్యుత్సాహం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసినట్టు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది ఆగస్టు 29 తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లిలో 75 ఇండ్లను బుల్డోజర్లతో కూల్చివేశారు. దివ్యాంగులతోపాటు పేదల ఇండ్లు కూలిపోవడంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పోలీసులు కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమంగా కేసులు నమోదు చేశారు. అందులో భాగంగానే శ్రీకాంత్‌గౌడ్‌పై కూడా అక్రమంగా కేసు నమోదు చేశారు. దీంతో శుక్రవారం సాయంత్రం శ్రీకాంత్‌గౌడ్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. విచారించి కోర్టులో హాజరు పరుస్తామని సీఐ గాంధీనాయక్ వెల్లడించారు.

బిగ్ బ్రదర్స్‌తో సెటిల్ చేస్కోండి

- ఖాళీ జాగా కనిపిస్తే పాగా
- రూ.500 కోట్ల విలువైన 26 ఎకరాల భూమి కబ్జా
- రౌడీలతో పహారా.. కుక్కలతో కాపలా
- పోలీసులను ఆశ్రయించినా వేస్ట్
- మైనంపల్లిని, బిగ్‌బ్రదర్స్‌ను కలవాలని సీపీ చెప్తున్నారు
- సీఎం బ్రదర్స్‌ను కలిసి సెటిల్‌మెంట్ చేసుకోవాలని స్థానిక నేతలు, పోలీసులు సలహా ఇస్తున్నారు
- మీడియా ఎదుట పలువురు బాధితుల ఆవేదన

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న మల్కాజిగిరి భూబాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరిలో భూ దందాల వ్యవహారంలో 'బిగ్ బ్రదర్స్' పాత్రపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం మరికొందరు బాధితులు మీడియా ముందుకు వచ్చారు. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన అశోక్‌రెడ్డి, అరుణ, కృష్ణ, రాకేశ్‌రెడ్డి తదితరులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మల్కాజిగిరి, తిరుమలనగర్ పరిధిలోని ఎన్జీఆర్‌నగర్, కేసీఆర్ బస్తీ తదితర ప్రాంతాల్లోని భూములను కబ్జా చేస్తున్నారని, వీటి వెనుక పెద్దోళ్లు ఉన్నారని ఆరోపించారు. తమకు చెందిన 26 ఎకరాల భూమిని కబ్జా చేశారని, ఆయా భూముల్లో రౌడీలు పాగా వేశారని, తాము అక్కడకు వెళ్తే కుక్కలను వదిలి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు సంబంధించిన వీడియాలను ప్రదర్శించారు. తమ భూములు కబ్జాకు గురయ్యాయని, న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిస్తే ఆ భూముల విలువ రూ.500 కోట్లు ఉంటుందని, ఇంత విలువైన భూముల విషయంలో తానేమీ చేయలేనని, మైనంపల్లి హన్మంతరావును, బిగ్‌బ్రదర్స్‌ను కలవాలని సూచిస్తున్నారని వారు పేర్కొన్నారు. సీపీ కనీసం తమ పత్రాలను కూడా పరిశీలించలేదని చెప్పారు. మైనంపల్లిని కలిసి ఏదో ఒకటి మాట్లాడుకోవాలని, వారి ద్వారా సీఎం బ్రదర్స్ కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డిని కలిసి ఏదో ఒక సెటిల్‌మెంట్ చేసుకోవాలని స్థానిక నేతలు, పోలీసులు చెప్తున్నారని వాపోయారు. మల్కాజిగిరిలో ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్